

సారపాకలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న విప్ రేగా కాంతారావు

# కేసీఆర్‌తోనే జనరంజక పాలన

**దసరా వేడుకల్లో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు**

సారపాక, అక్టోబర్ 24: సారపాకలోని బసప్పక్యాంప్‌లో ఏర్పాటు చేసిన బతుకమ్మ, దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు అంబరాన్నంటాయని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. మంగళవారం రాత్రి దుర్గమ్మ మండపం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేడుకల్లో భాగంగా మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలు, ఇతరత్రా సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేసి మాట్లాడారు. ఆరేళ్లుగా నిర్వాహకులు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవడం శుభపరిణామమన్నారు. బతుకమ్మ, దసరా ఉత్సవాలను 9 రోజుల పాటు నిర్వహించి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ప్రజలకు జనరంజకమైన పాలన అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌ది మాత్రమేనని స్పష్టం చేశారు. అనంతరం రేగాను ఉత్సవ కమిటీ నిర్వాహకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. నిర్వాహకులు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్



సాయికృష్ణకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

టేకులపల్లి, అక్టోబర్ 24: కాంగ్రెస్ ఇల్లెందు నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ బీఆర్ఎస్‌లోకి ఇస్లావత్ సాయికృష్ణ బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ విధానాలు నచ్చి, కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. టేకులపల్లి మండలం దాస్‌తండాలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ సమక్షంలో ఆయన బీఆర్ఎస్‌లో చేరగా.. గులాబీ కండువా కప్పి ఆమె బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇస్లావత్ సాయికృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు. అలాగే, ఎమ్మెల్యే హరిప్రియ ఇల్లెందు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రజల్లో ఎంతో ఆదరణ ఉందని అన్నారు. అందుకే బీఆర్ఎస్‌లో చేరినట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్తకూ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు ప్రియాంక, రవికుమార్, భూక్యా బాలకృష్ణ, బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్, బానోత్ రామనాయక్, కిషన్‌నాయక్, చీమల సత్యనారాయణ, జాటోత్ నరేశ్ పాల్గొన్నారు.

# హరిప్రియ గెలుపు కోసం ప్రత్యేక పూజలు



హరిప్రియ విజయం కోసం పూజలు చేస్తున్న బీఆర్ఎస్ మండల నాయకులు

టేకులపల్లి, అక్టోబర్ 24: హరిప్రియానాయక్ ఇల్లెందు ఎమ్మెల్యేగా మరోసారి గెలుపొందాలని కోరుకుంటూ బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. టేకులపల్లి రామాలయంలో బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ పేరుతో నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. హరిప్రియ భారీ మెజార్టీతో విజయం సాధించాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ నాయకులు బానోత్ రామ, బానోత్ కిషన్, బోడ బాలునాయక్, చీమల సత్యనారాయణ, భూక్య బాలకృష్ణ, బానోత్ ప్రియాంక, బానోత్ రవికుమార్, దళపతి శ్రీనివాసరాజు, జర్పుల లచ్చునాయక్, జాల మురళి, చింత వెంకన్న, రాంబాబు, నాగేందర్, కుమ్మరి గురవయ్య పాల్గొన్నారు.

ఎంతోకాలంగా ఇల్లెందు ప్రజలు ఎదురుచూస్తున్న నూతన ఓసీ ఏర్పాటు పనులు చకచకా కొనసాగుతున్నాయి. ప్రజాభిప్రాయణ సేకరణతోపాటు అటవీ శాఖ అనుమతులు లభించడంతో సింగరేణి అధికారులు నూతన ఓసీ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇల్లెందు 21 ఇంక్లైన్ భూగర్భ గని మూసివేత తరువాత బొగ్గుట్ట భవితవ్యం ప్రశ్నార్థకంగా మారడంతో ఇల్లెందు ఏరియా మనుగడను కాపాడేందుకు అధికారులు నూతన జేకే ఉపరితల గని ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ప్రాజెక్టు కోసం రూ.297.88 కోట్ల మూలధనాన్ని కేటాయించారు.

- ఇల్లెందులో ముమ్మరంగా నూతన ఓసీ పనులు
- కొత్త ఉపరితల గనితో ఇల్లెందుకు పూర్వవైభవం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 657 మందికి జీవనోపాధి
- అటవీ అనుమతులు లభించడంతో లైన్ క్లియర్

# డిసెంబర్‌లో ప్రారంభించేలా..




ఇల్లెందు రూరల్, అక్టోబర్ 24: నూతన ఓసీ ఏర్పాటైతే ఇందులో జీ 13 గ్రేడు బొగ్గు లభించనుందని అధికారులు చెబుతున్నారు. 13 – 14 ఏళ్ల జీవితకాలం ఉన్న నూతన ఓసీతో ప్రత్యక్షంగా 122 మంది, పరోక్షంగా 535 మంది జీవనోపాధి పొందనున్నారు. జేకే 5 ఓసీలో విస్తరణ ప్రాజెక్టు నిల్వలు 2022–23లో అయిపోతున్నందున.. వినియోగదారులకు నిరంతరాయంగా బొగ్గును సరఫరా చేయడానికి, డిమాండ్, సరఫరా మధ్య అంతరాన్ని తగ్గించడానికి ప్రతిపాదిత జవహర్ ఖని ఓపెన్‌కాస్టు మైన్‌ను ప్రారంభించడం ఎంతో అవసరమవుతోంది. దీని వల్ల స్థానికులకు ప్రత్యక్ష, పరోక్ష పద్ధతుల్లో ఉపాధి అవకాశాలతోపాటు కమ్యూనికేషన్, విద్య, సమాజాభివృద్ధి, వైద్య సౌకర్యాలు మెరుగుపడుతాయి. ఈ నూతన ఓసీలో ఉత్పత్తి సామర్థ్యం సాలీనా 2.50 మిలియన్ టన్నులు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టు ప్రారంభమైతే ఉద్యోగులు బదిలీపై ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఇదేగాక నూతన ఉద్యోగుల నియామకం జరుగుతుంది. కాంట్రాక్టు కార్మికులకు జీవనోపాధి లభిస్తుంది. పరోక్షంగా క్యాంటీన్, వారపు సంత వంటివి వస్తాయి. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా జీవనోపాధి లభిస్తుంది.

## నిర్వాసితులు ఆందోళన చెందొద్దు: జాన్ ఆనంద్, ఏరియా జీఎం, ఇల్లెందు



నూతన ఓసీ గురించి నిర్వాసితులు ఆందోళన చెందొద్దు. ఏరియా మనుగడ కోసం ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నిర్వాసితులు నష్టపోకుండా ఉండేందుకు యాజమాన్య సానుకూలంగా ఉంది. ఓసీ ఏర్పాటైతే కార్మికులు ఎక్కడికి బదిలీపై వెళ్లాల్సిన అవసరం లేదు. మరో 12 ఏళ్లపాటు ఏరియాకు జీవితకాలం లభిస్తుంది. ఈ ఏడాది చివరి నాటికల్లా ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యేందుకు అవకాశం ఉంది.

## ఇల్లెందు ఏరియాకు మంచి మనుగడ..



జేకే ఓసీ మరో రెండు, మూడు నెలల కంటే ఎక్కువగా నడిచే అవకాశం లేదు. ఏరియా మనుగడకు కొత్త ప్రాజెక్టు ఓసీ అయితే చాలా బాగుంటుంది. సింగరేణి యాజమాన్యం కూడా దీని గురించే ఆలోచించి ఇల్లెందు ఏరియాను కాపాడాలన్న ఉద్దేశంతో నూతన ఓసీని ప్రారంభించేందుకు సన్నాహాలు చేపట్టింది. త్వరగా ఓసీ ప్రారంభమైతే ఉన్న ఊరిలోనే జీవనోపాధి లభిస్తుంది.

–ఎట్టి హరికృష్ణ, విజయలక్ష్మీనగర్, ఇల్లెందు

## మళ్లీ పాత వైభవం వస్తుంది..



జేకే ఓసీ తరువాత నూతన ప్రాజెక్టు ప్రారంభిస్తే ఏరియా మనుగడతోపాటు మరో 15 ఏళ్లపాటు తిరుగుండదు. మళ్లీ పాతరోజుల్లాగా ఇల్లెందుకు పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉంది. కాంట్రాక్టు కార్మికులకు, ఉద్యోగులకు జీవనాధార అవకాశాలు మెండుగా ఉంటాయి. నూతన ఓసీ ప్రారంభమవుతుందని ఎప్పటి నుంచో అంటున్నారు.

–తొంగరి శ్రీహరి, విజయలక్ష్మీనగర్, ఇల్లెందు

# ధూంధాంగా దసరా వేడుకలు

- ఇల్లెందులో ఉత్సవాలకు హాజరైన అశేష జనవాహిని
- సింగరేణి గ్రౌండ్‌లో అలరించిన కల్చరల్ ప్రోగ్రామ్స్



సాంస్కృతిక కార్యక్రమాల ప్రారంభంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఇల్లెందు, అక్టోబర్ 24: ఇల్లెందులో దసరా వేడుకలు ధూంధాంగా జరిగాయి. మైసూరు ఉత్సవాలకు దీటుగా దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సుధీర్‌తోత్లా (బబ్లూ), ప్రధాన కార్యదర్శి ఎస్.రంగనాథ్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని సింగరేణి గ్రౌండ్‌లో జరిగిన ఈ ఉత్సవాలకు నియోజకవర్గం నుంచే గాక ఇతర జిల్లాల నుంచి కూడా ప్రజలు హాజరయ్యారు. ఎల్ఈడీ లైట్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, జమ్మి పూజలు, ఆట వస్తువులు, వీనుల విందైన పాటల నడుమ యువత జోరుగా సందడి చేసింది. ఉమ్మడి జిల్లాలో ఇల్లెందు పట్టణంలో జరిగే దసరా వేడుకలకు ప్రత్యేకత ఉంది. సోమవారం జరిగిన దసరా ఉత్సవంలో ఎమ్మెల్యే హరిప్రియానాయక్ పాల్గొని జమ్మిచెట్టు వద్ద శమీ పూజ చేశారు. అలాగే, దసరా రోజున టేకులపల్లిలో ప్రచారాన్ని ప్రారంభించారు. సాయంత్రం ఇల్లెందు దసరా ఉత్సవాల్లో మాట్లాడారు. దసరా ఉత్సవాలు ఇల్లెందులో అంబరాన్నంటేలా నిర్వహించుకోవడం ఆనాదిగా వస్తోందని గుర్తుచేశారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు, టీబీజీకేఎస్ నాయకులు దిండిగాల రాజేందర్, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, జానీపాషా, నాదెండ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.రంగనాథ్, మనోహర్ తివారి, పరుచూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




## అనారోగ్య సమస్యలతో వృద్ధుడి ఆత్మహత్య

టేకులపల్లి, అక్టోబర్ 24: అనారోగ్య సమస్య తట్టుకోలేక పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. టేకులపల్లి ఎస్సై గన్‌రెడ్డి రమణారెడ్డి కథనం ప్రకారం.. టేకులపల్లి మండలం ప్రేగళ్లపాడు పంచాయతీ పడమటిగుంపు గ్రామానికి చెందిన జోగ జోగయ్య (70) కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. అనార్యోగం తగ్గదేమోనని రోజూ మదనపడుతూ ఉండేవాడు. ఇదే దిగులుతో సోమవారం ఉదయం పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

టేకులపల్లి, అక్టోబర్ 24: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని బొమ్మనపల్లిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. టేకులపల్లి ఎస్సై గన్‌రెడ్డి రమణారెడ్డి కథనం ప్రకారం.. టేకులపల్లి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన ఆకుల భద్రయ్య (45) ఆదివారం పొలానికి వెళ్లాడు. పనులన్నీ ముగించుకొని రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో బొమ్మనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో కొత్తగూడెం – ఇల్లెందు ప్రధాన రహదారిపై గుర్తుతెలియాని వాహనం ఢీకొనడంతో మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఆకుల సాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.